

భోగి భాగ్యాలతో సంక్రాంతి వెలుగులు నిండాలి


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం) : ప్రతి ఇంటా సంక్రాంతి వెలుగులు విరజిమ్మాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆయన ఆదివారం వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నాయుడుపేట టౌన్ : సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, సుఖ సంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆకాంక్షించారు. ఆయన ఆదివారం ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షాలు తెలిపారు.


ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఘనంగా భోగి మంటలు



పెళ్లకూరు : శిరసనంబేడులో ఉత్సాహంగా భోగి మంటలు వేస్తున్న దృశ్యాలు, రంగవల్లులతో అందంగా వాకిళ్లు

సైదాపురం: మండలంలో శనివారం రాత్రి నుంచే భోగి మంటలు వేశారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారితోపాటు విదేశాల్లో ఉన్న వారు కూడా సొంత ఊళ్లకు తరలివచ్చారు. ఆదివారం పెద్ద భోగితో పండుగ వాతావరణం నెలకొంది.

చిల్లకూరులో..

చిల్లకూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం రాత్రి నుంచే పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. భోగి మంటలలో ఉంచిన బిందెలలోని నీటితో కొత్త అల్లుళ్లకు తలంటి స్నానం చేయించి కొత్త బట్టలు పెట్టారు. అలాగే చిన్న పిల్లలకు భోగి పండ్లు(రేగు పండ్లు)తో స్నానాలు చేయించారు. కోలాటాలు, పండరి భజనలు, గొబ్బెమ్మలు తడుతూ ఉత్సాహంగా జానపద గీతాలను ఆలపించారు. ప్రతి ఇంటి ముంగిటా భోగి సంబరాలు కనిపించాయి.

దక్కిలిలో..

దక్కిలి: దక్కిలి, బాలాయపల్లి మండలాల్లో ఆదివారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. శనివారం రాత్రి నుంచే పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. ఉద్యోగాలు, పనుల కోసం ఇతర ప్రాంతాల్లో నివసించే వారు సంక్రాంతి సందర్భంగా స్వగ్రామానికి చేరుకోవడంతో సందడి నెలకొంది. మహిళలు ఇళ్ల ముంగిట పోటీలు పడి ముగ్గులు వేసి రంగులు అద్దారు.

నాయుడుపేట టౌన్‌లో..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలో ఆదివారం ప్రజలు భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని రాజగోపాలపురం, మార్కెట్ సెంటర్, బేరిపేట, పడమటి వీధి తదితర ప్రాంతాల్లో యువకులు పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. మహిళలు ఇళ్ల ముంగిట అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం : మండలంలో ఆదివారం భోగి పండుగ ఘనంగా జరుపుకున్నారు. యువత రెండు రోజుల నుంచే భోగి మంటలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. శనివారం రాత్రి నుంచే దొరవారిసత్రం, కుప్పారెడ్డిపాళెం, ఏకొల్లు, పాళెంపాడు, తల్లంపాడు, పూలతోట తదితర గ్రామాల్లో భారీ ఎత్తున భోగి మంటలు వేశారు. ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు : మండలంలో ఆదివారం భోగి మంటలను ఉత్సాహంగా వే శారు. దట్టంగా మంచు కురుస్తున్నా, తీవ్రమైన చలిని కూడా లెక్క చేయలేదు. చిల్లకూరు, పెళ్లకూరు, శిరసనంబేడు, నెలబల్లి, తాళ్వాయిపాడు తదితర గ్రామా ల్లోని ప్రజలు భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: పట్టణం, మండలంలో ఆదివారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. మండలంలో సమృద్ధిగా వర్షాలు పడడంతో రైతుల ముంగిట్లో సంక్రాంతి పండుగ సంబరం కనిపిస్తోంది. ఈ ప్రాంతంలో చాలా మంది యువతీ యువకులు పలు కంపెనీల్లో పనిచేస్తుండడంతో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు.

వాకాడులో

వాకాడు : మండలంలో ఆదివారం ప్రజలు భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. మహిళలు పోటీ పడి వివిధ రంగులతో ముగ్గులు వేశారు. బంధువులు, కొత్త అల్లుళ్లతో గ్రామాల్లో సందడి నెలకొంది. దుకాణాలు, స్వీట్లు, పప్పుదినుసుల దుకాణాలు కిటకిటలాడాయి.

రాపూరులో..

రాపూరు : మండలంలో ఆదివారం భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. యువకులు తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. మహిళలు ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు వేసి మధ్యలో గొబ్బెమ్మను అలంకరించారు.

కలువాయిలో..

కలువాయి: మండలంలో ప్రజలు ఆదివారం భోగి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాజుపాలెం పరమానంద ఆశ్రమం ఆవరణలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గోదా, రంగనాథ స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన ముప్పాళ్ల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం ప్రత్యేక పూజలు చేశారు.

అంగరంగ వైభవంగా గోదాదేవి కల్యాణం




గోదాదేవి కల్యాణం చేస్తున్న వేద పండితులు, ఆలయ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు విశేషంగా అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు మంజుశ్రీ, వెంకటసాయి చైతన్య, మోనిషా ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయానికి చెందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కమిటీ సభ్యులు, దాతల సమక్షంలో ఆవిష్కరించారు. ఏర్పాట్లను ఈవో తాతా శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి, హృతిక్‌రెడ్డి పర్యవేక్షించారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం రాత్రి గోదాదేవి కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు విట్టా శ్రీనివాస శర్మ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి శ్రీకృష్ణుని ఆలయం వద్ద గోదాదేవికి కల్యాణోత్సవ పూజలు చేస్తున్నారు. చివరి రోజు కల్యాణ మండపం వద్ద స్వామి, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పెసల జయ రాజగోపాల్, కిషోర్‌బాబు, కనమర్లపూడి సుబ్రమణి, కోటా వెంకటేశ్వర్లు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీధనమల్లిలో వ్యక్తి నేత్రదానం


కృష్ణారెడ్డి(ఫైల్)

దొరవారిసత్రం : శ్రీధనమల్లికి చెందిన దువ్వూరు కృష్ణారెడ్డి(85) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. దీంతో సూళ్లూరుపేట పట్టణ ప్రాంతానికి చెందిన ఆచార్య భరద్వాజ సేవా సమితి వారు కార్నియాలను సేకరించారు. వాటిని చెన్నైలోని శంకర నేత్రాలయకు అందజేశారు.

కండలేరులో 12.964.టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 12.694 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటరీ నుంచి సత్యసాయిగంగకు 225 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏటి పండుగకు ఏర్పాట్లు సిద్ధం

నాయుడుపేట టౌన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖి నది వద్ద ఈ నెల 16వ తేదీ 18 వరకు ఏటి పండుగను ఘనంగా నిర్వహించనున్నట్టు మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు. కె.జయరామయ్య తెలిపారు. వారు ఆదివారం నది వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. బుల్లి తెర నటులు, సినీ గాయకులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వర్ణముఖి నది వద్ద ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

గడప గడపకూ అయోధ్య అక్షింతలు

వాకాడు : అయోధ్యలో ఈ నెల 22న జరగనున్న శ్రీ బాల రామచంద్రుని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా వచ్చిన అక్షింతలను ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలిరెడ్డిపాళెంలో గడప గడపకూ పంపిణీ చేశారు. వేదపండితులు దీవి అనంతాచార్యులు అక్షింతలకు పూజలు చేసి శ్రీరామ సేన సభ్యులతో ఇంటింటికీ అందజేశారు. శివకుమార్, పవన్, వంశీ, గురుప్రసాద్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం, బేబీ కిట్ల పంపిణీ

గూడూరు రూరల్ : గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉన్న ప్రసూతి విభాగంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ వైజేపీ ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారం, బేబీ కిట్లను పంపిణీ చేశారు. దాత మురళీనాయుడు మాట్లాడుతూ ప్రతినెలా లయన్స్ క్లబ్ ఆఫ్ వైజేపీ ఆధ్వర్యంలో బేబీ కిట్లు అందజేస్తున్నట్టు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్ఎల్ఎన్.స్వామి, ఆర్‌వీ రావు, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

చిల్లకూరు : కడివేడు రెవెన్యూ పరిధిలోని 3 గిరిజన కాలనీల్లో 250 మందికి ఆదివారం చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధినేత శ్రీనివాసులు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని ఐదు పంచాయతీల్లో ఉన్న 8 గిరిజన కాలనీల్లో 2 వేల మందికి చీరలు, పంచెలు, టవళ్లు అందజేశామన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు పిచ్చయ్యనాయుడు, రామానాయుడు, బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు కోడి పందెం రాయుళ్ల అరెస్టు

కోట: మండలంలోని కొత్తపాళెం సమీపంలో ఆదివారం కోడి పందేలు ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి ఏడు కోళ్లు, రూ.6,650 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

పెళ్లకూరులో ఐదుగురు..

పెళ్లకూరు : మండలంలోని చిల్లకూరు వడ్డిపాళెం సమీపంలో ఆదివారం కోడి పందెం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ.3,900 నగదు, మూడు సెల్‌ఫోన్లు, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. స్వర్ణముఖి నదీ తీరాన కోడి పందేలు ఆడుతున్నట్టు సమాచారం అందడంతో స్థానిక పోలీసులతో కలిసి దాడి చేసినట్టు పేర్కొన్నారు.

రోడ్లను కమ్మేసిన పొగమంచు



వాకాడు : మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు పొగ మంచు కమ్ముకుంది. దీంతో రోడ్లు కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. కొన్ని చోట్ల వాహనాలు 9 గంటల వరకు హెడ్ లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది.